సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



ఎండల్లో బండ్లు జాగ్రత్త

అధిక ఉష్ణోగ్రతలతో మనుషులతో పాటు వాహనాలకూ ప్రమాదం పొంచి ఉందని వాహన రంగ నిపుణులు చెబుతున్నారు. 10లో



'కొర్రమేను'పై దృష్టి పెట్టాలి

కొర్రమేను చేపల పెంపకంపై రైతులు, మహిళలు దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 40° / 27°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఉదయం మొదలైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణం వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి సమర్పించాక మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, వేద పడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు

పవర్ లిఫ్టింగ్‌లో బీటీపీఎస్ ఉద్యోగి ప్రతిభ



రాజేష్‌ను అభినందిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్ : ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బీటీపీఎస్ ఉద్యోగి పి.రాజేష్ 110 కేజీల బెంచ్ ప్రెస్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఆయనను బీటీపీఎస్ సీఈ బిచ్చన్న గురువారం అభినందించారు. అనంతరం సీఈ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని, సంస్థకు పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. క్రీడలు, క్రీడాకారులకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్రీడా కార్యదర్శి కల్తీ నర్సింహరావు, డీఈ టెక్ సత్యనారాయణ, ఏడీఈ మూర్తి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల గైర్హాజరును నివారించాలి



మాట్లాడుతున్న కవితానాయుడు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగులు, కార్మికుల గైర్హాజరు శాతాన్ని గణనీయంగా తగ్గించాలని పర్సనల్ జీఎం (ఐఆర్‌పీఎం అండ్ వెల్ఫేర్) కవితానాయుడు అన్నారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాల పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో స్థానిక సింగరేణి ప్రధాన కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియాల వారీగా విధులకు గైర్హాజరవుతున్న వారిపై తీసుకోబోయే క్రమశిక్షణ చర్యలు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, కోర్టు కేసులు, ఉద్యోగుల పదోన్నతులు, కారుణ్య నియామకాలు, రిటైర్డ్ ఉద్యోగుల సీఎంపీఎఫ్, పెన్షన్, క్లెయిమ్, గ్రాట్యుటీ వంటి అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. అనంతరం కవితానాయుడు మాట్లాడుతూ.. తరచుగా గైర్హాజరయ్యే ఉద్యోగులకు వారి కుటుంబసభ్యులతో కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఫైళ్లు కూడా పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డీజీఎంలు అజయ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, ఎస్.రమేష్, ఎస్.వరప్రసాద్, వెంకటేశ్వరరావు, జి.వి. మోహన్‌రావు, వైఎల్ ప్రసాదరావు, రాజ్‌గోపాల్, ముకుంద సత్యనారాయణ, సీఎంపీఎస్ మూర్తి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హామీపై గప్‌చుప్!

- ఇల్లెందుకు సీతారామ నీరందించాలని కోరుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి
- గత నెల 18న రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించిన నర్సయ్య
- వెంటనే సమావేశం ఏర్పాటుచేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- నేటికి నెల రోజులైనా పురోగతి శూన్యం



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గుమ్మడి నర్సయ్య, పక్కన మంత్రులు, ఎమ్మెల్యే కోరం కనకయ్య (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ నీళ్లు ఇచ్చే విషయంపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసి నెల రోజులు గడిచినా ఈ అంశంపై పురోగతి లేదు.

సీఎంకు గుమ్మడి వినతి..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతుండగా గత నెల 18న సీఎం రేవంత్‌రెడ్డిని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కలిసి, ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ద్వారా గోదావరి నీరు అందించాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. ఇల్లెందుపై చర్చించేందుకు త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశానికి సంబంధిత అధికారులు, మంత్రులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అఖిల పక్ష నేతలను ఆహ్వానించాలని సూచించారు. గతంలో ఏం జరిగింది.. ఇప్పుడేం జరుగుతోంది.. ఎలా చేస్తే ఇల్లెందు ప్రజలకు మేలు అనే అంశాలపై చర్చించి న్యాయం చేయాలని చెప్పారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ త్వరలోనే ఇల్లెందు సమస్యపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

ఇల్లెందుకు అదనపు ప్రణాళిక..

సీతారామ ప్రాజెక్టులో ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించి అదనపు ప్రణాళికను 2023 వేసవిలో జలవనరుల శాఖ సిద్ధం చేసింది. దీని ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో కొత్తగా 1,13,287 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ ప్లాన్ అంచనా వ్యయం రూ. 3,200 కోట్లు. ఇందులో కొత్త పంపుహౌస్‌లు నిర్మించడంతో పాటు బయ్యారం చెరువు మత్తడిని 16 అడుగుల నుంచి 19 అడుగులకు పెంచాలని నిర్ణయించారు. తద్వారా మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాల్లోని పొలాలకు సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించారు.

పునాది పడింది ఇక్కడే..

సీతారామ ప్రాజెక్టుకు 2016లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. తొలి ప్లాన్‌లో ఇల్లెందు నియోజకవర్గంలోని రోళ్లపాడు వద్ద 10 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించి, అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పొలాలకు గోదావరి జలాలు పారించాలని నిర్ణయించారు. అయితే గోదావరి నుంచి రోళ్లపాడు వరకు నీటిని తరలించే కెనాల్ మార్గంలో కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాక్‌లు ఉండడంతో అనుమతుల సాధన సాధ్యం కాదంటూ ఈ ప్లాన్‌లో మార్పులు చేశారు. ఇలా సీతారామ ద్వారా లబ్ధి పొందే నియోజకవర్గాల జాబితా నుంచి ఇల్లెందు (కామేపల్లి మండలం మినహా) కనుమరుగైంది. దీంతో సీతారామతో ఇల్లెందు నియోజకవర్గానికి న్యాయం చేయాలంటూ పార్టీలకు అతీతంగా జిల్లాతో పాటు గార్ల, బయ్యారం మండలాల ప్రజలు పోరాటం చేస్తున్నారు.

నెలయినా కదలిక లేదు..

సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చి నేటికి నెల రోజులైనా ఎలాంటి పురోగతి లేదు. ఈ అంశంపై గుమ్మడి నర్సయ్యకు కానీ, ఇతర ప్రజాప్రతినిధులు, అఖిల పక్ష నేతలకు కానీ ఇరిగేషన్ అధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో అసలు సమావేశం నిర్వహిస్తారా లేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. మరోవైపు సీతారామ ప్రాజెక్టు డీపీఆర్‌కు ఇంకా సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) అనుమతులు రాలేదు. ఈ అంశంపై కేంద్ర జల సంఘం ఈనెల 24న ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తోంది. అప్పటివరకైనా ఇల్లెందు ప్లాన్‌పై చర్చించి సీతారామ డీపీఆర్‌లో చేర్చాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పిలుపు కోసం ఎదురుచూస్తున్నా

ఇల్లెందుకు గోదావరి నీళ్లు ఇచ్చే అంశంపై నీటిపారుదల శాఖ అధికారులు నిర్వహించే సమావేశానికి పిలుపు ఎప్పుడొస్తుందా అని ప్రతీరోజు ఎదురుచూస్తున్నా. ప్రాజెక్టుకు సంబంధించి మీడియాలో వస్తున్న ప్రతీ విషయాన్ని ఆసక్తిగా తెలుసుకుంటున్నా. ఇల్లెందుకు న్యాయం జరగాలన్నదే నా లక్ష్యం.

– గుమ్మడి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి



ఆళ్లపల్లిలో మునగ చెట్టును పరిశీలిస్తున్న కలెక్టర్

గుండాల: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, అన్ని రికార్డులు సక్రమంగా ఉన్న హక్కుదారులు భయపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భూ భారతి చట్టంపై గురువారం ఆళ్లపల్లి, గుండాల మండల కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్, సకాలంలో విచారణ చేస్తామని, అర్హులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. అన్నదమ్ముల భూ పంపకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉంటుందన్నారు. హక్కుల రికార్డుల్లో ఏమైనా తప్పులుంటే ఈ చట్టంతో సవరణ చేసుకునే అవకాశం ఉందన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్ ఉన్న సాదాబైనామా దరఖాస్తులూ ఇప్పుడు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఇంటి స్థలాలకు, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ఉంటుందని, రైతులు ఎలాంటి రుసుం చెల్లించకుండా ఉచిత న్యాయ సహాయం అందుతుందని చెప్పారు. మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వం, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే వాటిని రద్దు చేసే అధికారం ఈ చట్టంలో ఉందని వివరించారు. సదస్సులో ఆర్డీఓ మధు, ఏడీఏ తాతారావు, తహసీల్దార్ ఇమ్మానియేల్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏంపీఓ శ్యాంసుందర్ రెడ్డి, ఏఓ వెంకటరమణ, ఎస్సై రాజమౌళి పాల్గొన్నారు.

మునగసాగుతో అధిక లాభాలు..

ఆయిల్ పామ్, మునగసాగుతో అధిక లాభాలు పొందొచ్చని కలెక్టర్ పాటిల్ అన్నారు. ఆళ్లపల్లి మండలంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్, మునగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల ఆయిల్‌పామ్ సాగు పెరిగిందని, నీరు పుష్కలంగా అందిస్తూ మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని అన్నారు. పొలం గట్లపై, అంతర పంటగా మునగ సాగు చేసుకోవాలని సూచించారు. ఇది తక్కువ కాలంలో వచ్చే పంట అన్నారు. అనంతరం గుండాల మండలం యాపలగడ్డలో సమక్క–పగిడిద్దరాజు దేవతలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం అభివృద్ధికి సహకరించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ఐటీడీఏ ఆవరణలో నిర్మించిన గిరిజన మ్యూజియంపై భక్తులు, పర్యాటకులకు అవగాహన కల్పించాలని, మ్యూజియం అభివృద్ధికి అందరూ సహకరించాలని పీఓ బి.రాహుల్ అన్నారు. స్థానిక గిరిజన భవనంలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు, పర్యాటకులు పర్ణశాల, పాపికొండల సందర్శనకు మొగ్గు చూపుతారని, అంతకంటే ముందు గిరిజన మ్యూజియాన్ని చూసేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. పాత తరం కళాఖండాలతో పాటు వ్యవసాయ పద్ధతులు, గిరిజన వంటకాలు, పాతకాలపు ఇళ్లు, వెదురు బొమ్మలను మ్యూజియంలో ఏర్పాటు చేశామని వివరించారు. మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకుల నుంచి అధిక చార్జీలు తీసుకోవద్దని చెప్పారు. అనంతరం మ్యూజియానికి సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ తదితరులు

పినపాక: ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, అడ్మిషన్ల సంఖ్య పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరా చారి ఉపాధ్యాయులను ఆదేశించారు. మండల పరిధిలోని ఈ బయ్యారం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందజస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ సక్రమంగా పాటించాలని, అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలివిడత పాఠ్య పుస్తకాలు చేరాయి..

కొత్తగూడెంఅర్బన్: 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడతగా జిల్లాకు 39,150 పాఠ్య పుస్తకాలు వచ్చాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలను ఆయన పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో 5,08,400 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, తొలి విడతగా 39,150 పుస్తకాలు వచ్చాయని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి పుస్తకాలన్నీ వస్తాయని, ఆ వెంటనే మండలాల వారీగా పంపిణీ చేస్తామని చెప్పారు.

అభ్యసన స్థాయిని గుర్తించాలి

కరకగూడెం: విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించాలని డీఈఓ వెంకటేశ్వరాచారి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని భట్టుపల్లి, కరకగూడెం ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. బోధనా తీరును మెరుగుపర్చుకోవాలని, నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. అనంతరం మండల వనరుల కేంద్రంలో జరుగుతున్న నవోదయ పాఠశాల తాత్కాలిక మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏఎంఓ నాగరాజశేఖర్, ఎంఈఓ గడ్డం మంజుల, భట్టుపల్లి పాఠశాల హెచ్ఎం మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టండి

డీఎఫ్ఓ కిష్టాగౌడ్



అనంతారంలో మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ

జూలూరుపాడు: మొక్కల సంరక్షణపై అటవీ శాఖ సిబ్బంది దృష్టి పెట్టాలని డీఎఫ్ఓ కిష్టాగౌడ్ అన్నారు. మండలంలోని అనంతారం నుంచి నల్లబండబోడు వరకు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలతో పాటు వినోబానగర్ అటవీ నర్సరీలో మొక్కలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కల పెరుగుదల, రక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. అడవిలో చెట్లు నరకకుండా నిఘా పెంచాలని, వేసవి దృష్ట్యా అడవి జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటి వసతి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, గుండెపుడి డీఆర్ఓ ఎస్‌కే నసూర్‌బీ, ఎఫ్‌బీఓలు రేఖ, డి.కిషన్, సలీమ్, శరణ్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

డీపీఓ చంద్రమౌళి




ఎర్రబోరులో బోరును పరిశీలిస్తున్న డీపీఓ

పాల్వంచరూరల్ : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ఎర్రబోరు, బంద్రుగొండ, కొయ్యగుంపు తదితర గొత్తికోయల ఆవాసాలను గురువారం ఆయన పరిశీలించారు. తాగునీటి సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. చేతిపంపులు నిరంతరం పనిచేసేలా చూడాలని, సోలార్ మోటార్లను వెంటనే మరమ్మతు చేయాలని మిషన్ భగీరథ ఏఈ, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కోయగట్టు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు సక్రమంగా పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని పిల్లలంతా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామానికి రహదారి, విద్యుత్ సౌకర్యం లేదని, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో పిల్లలు మధ్యలోనే బడి మానేస్తున్నారని స్థానిక గిరిజనులు డీపీఓ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ బొగ్గ నారాయణ, ఏఈ మహేశ్వరి, కార్యదర్శులు ప్రవీణ్, నారాయణ, దుర్గారావు పాల్గొన్నారు.

ధీమా ఇవ్వని బీమా

- ఆరేళ్లుగా అడ్రస్ లేని పశువుల బీమా పథకం
- పాడి రైతులకు కరువైన భరోసా
- పునరుద్ధరించాలని వేడుకోలు



జిల్లాలో పశు సంపద వివరాలిలా

ఆవులు, ఎద్దులు :	2,00,844
గేదెలు :	1,25,587
గొర్రెలు :	1,55,406
మేకలు :	2,00,462
పందులు:	1,964
మొత్తం :	6,84,263

బూర్గంపాడు: పశువుల బీమా పథకం పత్తా లేకుండా పోయింది. కంటికి రెప్పలా కాపాడుకునే పశువులకు ఏదైనా ప్రమాదం జరిగితే బీమా వర్తించే పరిస్థితి లేదు. గతంలో పశువుల బీమాను ప్రోత్సహించిన ప్రభుత్వాలు ప్రస్తుతం నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీంతో పశువులను పోషించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి ఊతమిచ్చాయి. రైతులు కొంత సొమ్ము చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించేవి. ప్రమాదవశాత్తు పశువులు మృతిచెందితే యజమానులకు బీమా సొమ్ము అందడం ద్వారా ఆర్థిక భరోసా దక్కేది.

భారీగా పెరిగిన ధరలు..

పశు పోషణ రోజురోజుకూ కష్టంగా మారుతోంది. పశు సంపద తగ్గిపోతున్న తరుణంలో ఆవులు, గేదెల ధరలు నింగినంటుతున్నాయి. మేలు రకం జాతి పశువుల ధర రూ. లక్షల్లో ఉంటుండగా.. మాంసానికి డిమాండ్ ఉండడంతో మేకలు, గొర్రెల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పశువులు, జీవాలకు బీమా చేయించేందుకు రైతులు ఆరాట పడుతున్నారు. అవి మేతకు వెళ్లినప్పుడు అనుకోని ప్రమాదం జరిగితే యజమానులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. జిల్లాలో ప్రతీ సంవత్సరం విద్యుదాఘాతం, పిడుగుపాట్లతో వందల సంఖ్యలో పశువులు మృత్యువాత పడుతున్నాయి. రోడ్లపై గుర్తు తెలియని వాహనాలు ఢీకొని కూడా పశువులు మృతి చెందుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పశువుల బీమా అమలు చేయాలని రైతులు, యజమానులు కోరుతున్నారు. కొన్ని ప్రైవేట్ సంస్థలు మేలు జాతి పశువులకు బీమా చేస్తున్నా.. ప్రీమియం చాలా ఎక్కువగా ఉంటోంది. దీంతో చిన్న, సన్నకారు రైతులు బీమా చేయించలేకపోతున్నారు. ప్రభుత్వం కొంత, రైతులు కొంత చెల్లించే అవకాశం ఉంటే ఎక్కువ మంది బీమా చేయించేందుకు ముందుకొచ్చే అవకాశం ఉంటుంది.

అటకెక్కిన పథకం..

2017 – 18 వరకు పశువుల బీమా పథకం పూర్తిస్థాయిలో కాకున్నా అక్కడక్కడా అమలయ్యేది. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై పూర్తిగా నిర్లక్ష్యం వహించాయి. దీంతో ఈ పథకం అటకెక్కింది. పశువులు మృతి చెందితే రూ.లక్షల్లో నష్టపోతున్నామని, ఇకనైనా పాలకులు స్పందించి పశువుల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

బీమా అమలు చేయాలి

పశువుల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలి. ప్రైవేటుగా బీమా చేయాలంటే వేల రూపాయలు ఖర్చవుతున్నాయి. బీమా చేయకుంటే ఏదైనా ప్రమాదం జరిగి పశువులు చనిపోతే ఒక్క రూపాయి కూడా చేతికి రావడం లేదు.

– నిమ్మల రాములు, రైతు, నాగినేనిప్రోలు

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం

పశువుల బీమా పథకం అమలు చేయాలంటూ చాలా మంది రైతులు అడుగుతున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా కోసం కొంత బడ్జెట్‌ను ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించేవి. గత ఆరేళ్లుగా బీమా పథకం పూర్తిగా నిలిచిపోయింది. రైతుల వినతులను ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

– డాక్టర్ పురంధర్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు మందిరాలు ముస్తాబు



ముస్తాబైన మామిడిగూడెం చర్చి

ఇల్లెందురూరల్ : ఏసుక్రీస్తుకు శిలువ వేసిన గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ప్రార్థనా మందిరాలను ముస్తాబు చేశారు. ఏసు ప్రభువు శిలువ మరణం పొందడం సర్వమానవాళికి శుభమని వారు విశ్వసిస్తారు. ఈ క్రమంలో ఈనెల 19న రన్ ఫర్ జీసస్, 20వ తేదీన ఈస్టర్ (ప్రభువు తిరిగి వచ్చిన రోజు) పండుగలను నిర్వహిస్తారు. కాగా, ఈస్టర్‌కు ముందు 40 రోజులు.. అంటే మార్చి 10వ తేదీన ప్రారంభమైన ఉపవాస దీక్షలు ఈనెల 20వ తేదీన ముగియనున్నాయి.

ఆదివాసీలకు మౌలిక వసతులు కల్పిస్తాం

ఎస్పీ రోహిత్‌రాజు భరోసా



బైక్‌పై వెళ్తూ రోడ్డును పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

చర్ల: సరిహద్దు ప్రాంతాల ఆదివాసీలకు విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌళిక వసతుల కల్పిస్తామని ఎస్పీ రోహిత్‌రాజు భరోసా ఇచ్చారు. మండలంలోని మారుమూల గ్రామం పూసుగుప్ప నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు వరకు ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డును గురువారం ఆయన సందర్శించారు. చర్ల నుంచి 18 కిలోమీటర్ల దూరంలోని పూసుగుప్ప వరకు ద్విచక్ర వాహనంపై ప్రయాణించిన ఎస్పీ.. మధ్యలో నిర్మిస్తున్న వంతెనలు, లోలెవల్ చప్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా రాంపురం, బీమారంపాడు, పూజారికాంకేర్, చిన్న ఊట్లపల్లి, పెద్ద ఊట్లపల్లి తదితర గ్రామాల ఆదివాసీల కోసం రూ.3కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మించామని తెలిపారు. ఆదివాసీలను అభివృద్ధికి దూరం చేయాలని మావోయిస్టులు చూస్తున్నారని, వారి ఆటలు చెల్లవని అన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, రవాణా సౌకర్యాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ పని చేస్తున్నాయని వివరించారు. పూసుగుప్ప, చెన్నాపురం గ్రామాల్లో త్వరలోన మొబైల్ ఆస్పత్రులను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకు 220 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మిగిలిన వారు కూడా జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్, చర్ల సీఐ రాజువర్మ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు ఆర్.నర్సిరెడ్డి, పి.కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మామిడి మొక్కల పెకిలింపు

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలోకి అక్రమంగా ప్రవేశించి, మామిడి మొక్కలను పెకిలించడంతోపాటు చంపుతామని బెదిరించిన వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన యర్రపాటి పకీర్‌రావు అఖినేపల్లిలోని తన వ్యవసాయ భూమి మామిడి మొక్కలు సాగు చేస్తున్నాడు. బుధవారం మందలపల్లి గ్రామానికి చెందిన వేమవరపు రామకృష్ణ, దండాబత్తుల కాంతారావులు పకీర్‌రావుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలోకి అక్రమంగా ప్రవేశించి, సాగులో ఉన్న మామిడి మొక్కలను పెకిలించారు. ప్రశ్నించిన పకీర్‌రావు కుమారుడు ఏకాంబరేశ్వరరావు, అతడి మిత్రుడు కోలికపోగు కాంతారావులను చంపుతామని కత్తితో బెదిరింపులకు పాల్పడ్డారు. పెకిలించిన మొక్కల విలువ రూ.10,000 ఉంటుందని బాధితులు తెలిపారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

'రాజీవ్ యువ వికాసం'పై ఆరా



దరఖాస్తుదారుల జాబితా పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

చండ్రుగొండ : రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులపై జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి ఆరా తీశారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. రుణాల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తుల జాబితా పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 14 పంచాయతీల్లో 3200 మంది లబ్ధిదారులు ఉన్నారని, తొలి, మలి విడతల్లో బెండాలపాడు గ్రామానికి మంజూరైన 303 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని ఎంపీడీఓ వివరించారు.

బాల్య వివాహం.. కేసు నమోదు

పాల్వంచరూరల్: మైనర్ బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మొండికట్ట గ్రామానికి చెందిన 21 ఏళ్ల గండికోట రవీందర్ అదే గ్రామానికి చెందిన 7వ తరగతి చదువుతున్న 16 ఏళ్ల బాలికను ఈ నెల 11న వివాహం చేసుకున్నాడు. ఈ ఘటనపై చైల్డ్‌లైన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత ఫిర్యాదు మేరకు రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడి...

రూ.68 వేలు పోగొట్టుకున్న యువకుడు

పాల్వంచరూరల్: సెల్ ఫోన్‌లో గేమ్ ఆడి రూ.68 వేలు పోగొట్టుకున్నాడో యువకుడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కేశవాపురం గ్రామానికి చెందిన మాళోత్ రాణి కుమారుడు వంశీ ఈ నెల 14న సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుకుంటున్నాడు. అదే సమయంలో రూ.పదివేలు పెట్టి ఆడితే రెట్టింపు డబ్బులు గెలవవచ్చని అపరిచిత వ్యక్తి నుంచి లింక్ వచ్చింది. దీంతో యువకుడు లింక్ ఓపెన్‌చేసి గేమ్ ఆడగా, రూ.68 వేలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులపై ఫిర్యాదు

చుంచుపల్లి: మండల పరిధిలో మైక్రో ఫైనాన్స్ యజమానులు పలువురు మహిళలను రుణాల విషయంలో వేధిస్తున్నారని గురువారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రవి కుమార్‌కు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

దమ్మపేట: బైక్‌ను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని వెంకటరాజాపురం సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన నడ్డి రాజు, అల్లంశెట్టి కృష్ణారావు, తంగిరాల శ్రీలత(35)లు బుధవారం రాత్రి సమయంలో బైక్‌పై అశ్వారావుపేట నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో వెంకటరాజాపురం గ్రామ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రీలతకు తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రురాలి భర్త రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

పాఠశాలలో చోరీ

జూలూరుపాడు: మండల కేంద్రంలోని కోయ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గురువారం ఉదయం పాఠశాలకు వచ్చేసరికి పాఠశాల తలుపులు, లోపల ఇనుప బీరువా పగులగొట్టి మైక్ స్పీకర్, క్రీడా సామగ్రి అపహరించారని హెచ్‌ఎం జర్పుల కృష్ణ తెలిపారు. దీంతో ఎంఈఓ బానోత్ జుంకీలాల్, కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్యలకు, పోలీసులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారని, అనంతరం తాను స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు.

ఎండల్లో బండ్లు జాగ్రత్త

- వాహనదారులు నీడలోనే పార్కింగ్ చేయాలి
- ట్యాంక్ నిండా పెట్రోల్ నింపినా డేంజరే..
- అధిక ఉష్ణోగ్రతలు ఉంటే దూర ప్రయాణం చేయొద్దు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న నిపుణులు



పాల్వంచలోని ఐడీఓసీ కార్యాలయంలో ఎండలో పార్కింగ్ చేసిన వాహనాలు

కొత్తగూడెంటౌన్: ఎండలు భగభగ మండిపోతున్నాయి. బయటకు వెళ్తే ఎండవేడిమితో అవస్థ పడాల్సి వస్తోంది. అధిక ఉష్ణోగ్రతలకు మనతోపాటు వాహనాలకు కూడా ప్రమాదం పొంచి ఉందని వాహన రంగ నిపుణులు చెబుతున్నారు. వాహనాలను ఎండలో పార్కింగ్ చేస్తే ట్యాంకులు, టైర్లు పేలే అవకాశం లేకపోలేదు. ఎండలో ప్రయాణించేటప్పుడు పెట్రోల్, డీజిల్ లీకై ఏ చిన్న నిప్పు రవ్వ పడ్డా పెనుప్రమాదం సంభవిస్తుంది. ఎండల నుంచి మనం ఎలా రక్షణ చర్యలు తీసుకుంటున్నామో వాహనాలకూ అదే రీతిలో రక్షణ చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులు, నిపుణులైన మెకానిక్‌లు సూచిస్తున్నారు. ద్విచక్రవాహనాలపై దూర ప్రయాణాలు చేయొద్దని చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే కొత్తగూడెం ఫైర్ ఆఫీస్ 87126 99296, ఇల్లెందు ఫైర్ ఆఫీస్ 87126 99295 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

ద్విచక్ర వాహనదారులు ఇవి పాటించాలి

- ద్విచక్రవాహనాలను క చ్చితంగా నీడలోనే పార్కింగ్ చేయాలి.టైర్లలో గాలిని తగ్గించుకోవాలి.
- వాహనాలను గంటల తరబడి ఎండలో ఉంచితే రంగు కోల్పోతాయి. మళ్లీ రంగులు వేయించాలంటే దాదాపు రూ.6 నుండి 10 వేల వరకు ఖర్చు అవుతుంది.
- ఎండలో ఎక్కువ సేపు నిలిపి ఉంచితే వాహనాల ట్యాంకుల్లోని పెట్రోల్ ఆవిరి అవుతుంది.
- ఫుల్ ట్యాంకు పెట్రోల్ కొట్టిస్తే ఎండలకు ట్యాంకులు పేలే అవకాశం ఉంటుంది.
- రాత్రి వేళల్లో పెట్రోల్ ట్యాంకు మూతను ఓ సారి తెరిచి మూసివేస్తే అది సెట్ అవుతుంది.

కార్లు, లారీల యజమానులు..

- కార్లు, లారీలు, ఆటోలు వంటి వాహనాల్లో దూర ప్రయాణాలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి.
- వాహనాలను ఎండలో ఉంచితే ట్యాంకులో 40 నుంచి 80 శాతం ఇంధనం ఆవిరి అవుతుంది.
- వాహనాల రేడియేటర్లలో తగినన్ని నీళ్లు ఉండేలా చూసుకోవాలి. లేదంటే ఎండలకు ఇంజన్‌లు తరుచుగా ఆగిపోయే అవకాశం ఉంటుంది. ఎండ వేడికి ఇంజన్ ఆయిల్ తగ్గిపోతుంది.
- పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాహనాలు నడిపే వారు వీలైనంత వరకు వేసవిలో గ్యాస్ కిట్‌ను వినియోగించుకుండా చూసుకోవాలి. కార్లలో ఏసీ వినియోగిస్తే అద్దాలకు మ్యాట్స్‌ను బిగించుకోవాలి.
- ఎల్‌పీజీ వాహనాలను వేసవిలో ఉపయోగించకపోవడమే మేలు.
- ప్రభుత్వ అనుమతి ఉన్న గ్యాస్ కిట్లను మాత్రమే ఉపయోగించాలి. నాసిరకానివి వినియోగిస్తే అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- ప్రస్తుతం ఉదయం 8, 9 గంటలు దాటితే ఎండ తీవ్రత ఉంటోంది. వాహనదారులు ఎండలో ప్రయాణాలను చేయకూడదు.
- ప్రస్తుతం ఎలక్ట్రిక్ బైకులు, కార్ల వినియోగం కూడా పెరుగుతోంది. వేసవిలో ఈవీలతో యజమానులు చాలా జాగ్రత్తలు పాటించాలి. చార్జింగ్ పెట్టేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. అదే విధంగా బ్యాటరీ వేడిగా ఉన్నప్పుడు చార్జింగ్ పెట్టకూడదు.

అప్రమత్తంగా ఉండాలి




ఎండకాలంలో ప్రతీ వాహనదారుడు అప్రమత్తంగా ఉండాలి. వాహనాలను ఎండలో కాకుండా నీడలో పార్కింగ్ చేయాలి. దూర ప్రయాణాలు చేసేటప్పుడు వాహనాల్లో టైర్లలో గాలి తక్కువగా ఉండేలా చూసుకోవాలి. రీ బటన్ టైర్లను ఉపయోగించకూడదు. అదే విధంగా పెట్రోల్, డీజిల్‌ను ట్యాంక్ ఫుల్ చేయించొద్దు. బైక్‌లపై ఎండల్లో దూర ప్రయాణాలు చేయొద్దు.

– వి.వెంకటరమణ, ఇన్‌చార్జ్ ఆర్టీఓ

బీటీపీఎస్‌లో సిబ్బంది కొరత

- ఇటీవల మరో 49 మంది కార్మికుల బదిలీ
- రెండు, మూడు పని ప్రదేశాల్లో ఒక్కరికే బాధ్యతలు
- సబ్ ఇంజనీర్లు, కార్మికులపై పెరుగుతున్న పనిభారం



బీటీపీఎస్ ప్లాంట్

మణుగూరు రూరల్: బీటీపీఎస్ (భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్)లో సిబ్బంది కొరత వెంటాడుతోంది. జెన్ కో యాజమాన్యం సిబ్బంది నియామకాలపై దృష్టి సారించడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా ఉన్న ఉద్యోగులపై తీవ్ర పనిభారం పెరుగుతోంది. బీటీపీఎస్‌లోని నాలుగు యూనిట్లలో 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. కోల్ ప్లాంట్, యాష్‌ప్లాంట్, ఈఎస్‌పీ (ఎలక్ట్రో స్టార్టర్ పెసిఫికేటర్) వంటి ప్రదేశాలు కీలకంగా ఉంటాయి. అలాంటి పని ప్రదేశాల్లోనూ రెండు నుంచి మూడు ప్రదేశాలను ఒక్కరే పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సబ్ ఇంజనీర్లు పర్యవేక్షించాల్సిన పనులు కూడా పనిఒత్తిడితో కిందిస్థాయి కార్మికులతో చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాంట్‌లో సుమారు 1200 నుంచి 1500మంది ఉద్యోగులు అవసరం ఉండగా, ప్రస్తుతం వెయ్యి మంది మాత్రమే పనిచేస్తున్నారు. తాజాగా మరో 49 మంది బదిలీలతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పనిభారమైనా విధులు నిర్వహించాలని హుకుం జారీ చేయడం, చిన్న తప్పిదాలకే బాధ్యులను చేస్తూ మెమోలు జారీ చేస్తుండటంపై ఇటీవల ప్లాంట్‌లో పర్యటించిన సీఎండీకి పలు యూనియన్ల నాయకులు విన్నవించారు.

నియామకాలు చేపట్టకుండా..

నిబంధనల ప్రకారం ఒక్కో పని ప్రదేశంలో కనీసం ఇద్దరు పనిచేయాల్సి ఉంటుంది. ఒకరు అనారోగ్యానికి గురైనా, లేక అవగాహన, అనుభవ లేమి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇద్దరు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా, ఔట్ సోర్సింగ్ ఉపాధి అవకాశాలు పెంచే పరిస్థితులు ఉన్నా యాజమాన్యం పట్టించుకోవడంలేదు. విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే క్రమంలోనే సిబ్బంది నియామకాలు చేపట్టకుండా, ఉద్యోగులపై పనిభారం పెంచుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా నియామకాలు చేపట్టి ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలు లేకుండా చూస్తున్నాం



ప్లాంట్‌లో కొంత సిబ్బంది కొరత ఉన్న మాట నిజమే. డిప్యూటేషన్‌పై వచ్చిన 49 మంది తిరిగి వారి స్థానాలకు వెళ్లారు. సిబ్బంది కొరతతో ఏర్పడుతున్న సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య ఏర్పడకుండా ఉన్నవారితోనే పనులు చేయిస్తున్నాం. త్వరలో నియమాకాలు చేపట్టే అవకాశం ఉంది.

–బిచ్చన్న, సీఈ

'కొర్రమేను' పెంపకంపై దృష్టి సారించాలి

- 5వ తేదీకి యూనిఫాం కుట్టు పనులు పూర్తి చేయాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన



టైలర్లకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

అశ్వాపురం/ పాల్వంచరూరల్: కొర్రమేను చేపల పెంపకంపై రైతులు, మహిళలు దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో మాజీ సర్పంచ్ కొర్సా దుర్గారావు కొర్రమేను చేపల పెంపకం చేపడుతుండగా గురువారం అదనపు కలెక్టర్ సందర్శించారు. చేపల పెంపకానికి ఉపాధి హామీ పథకంలో ఉచితంగా నిర్మిస్తున్న ఫామ్‌పాండ్‌ను పరిశీలించారు. మల్లెలమడుగు, పాల్వంచ మండలం నాగారం, కేశవాపురం గ్రామాల్లోని కుట్టుమిషన్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొర్రమేను చేపల పెంపకం అశ్వాపురం మండలం మిట్టగూడెంలో జిల్లాలోనే ఆదర్శవంతంగా ఉందన్నారు. మే 5వ తేదీ నాటికి విద్యార్థుల యూనిఫాం ఒక జత చొప్పున కుట్టి అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. పిల్లల వ్యక్తిగత కొలతలను, రిజిస్టర్‌లో నమోదు చేసుకుని వాటి ఆధారంగా స్టిచింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎస్‌కె.సైదులు, డీపీఎం జ్యోతి, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ ముత్యాలరావు, ఎంఈఓ శ్రీరాంమూర్తి, ఏపీఎంలు రాంబాబు, ఏపీఎం సత్యనారాయణ, నాగార్జున, సీతరామయ్య, వెంకటేష్, మల్లేశం పాల్గొన్నారు.

ఏఐకేఎస్ జాతీయ కార్యవర్గంలో నలుగురికి స్థానం



బాగం హేమంతరావు



విశ్వనాథం



గోవిందరావు

ఖమ్మం మయూరిసెంటర్/పాల్వంచ/చింతకాని: అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎంఎస్) జాతీయ సమితిలో ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి స్థానం లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో గురువారం ముగిసిన జాతీయ మహాసభల్లో 36 మందితో జాతీయ కార్యవర్గం, 115 మందితో జాతీయ కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన బాగం హేమంతరావు జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అలాగే, భద్రాద్రి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, చింతకాని మండలం రాఘవాపురానికి చెందిన కొండపర్తి గోవిందరావుతో పాటు మందడపు రాణికి జాతీయ కౌన్సిల్‌లో సభ్యులుగా స్థానం దక్కింది. నేలకొండపల్లి మండలం ముటాపురానికి చెందని హేమంతరావు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, సీపీఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేయడంతో ప్రస్తుతం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కాగా, గోవిందరావు 1991లో సీపీఐలో కొనసాగుతుండగా వివిధ హోదాల్లో పనిచేయడమే కాక రాఘవాపురం సర్పంచ్‌గా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. ఈమేరకు వీరిని పలువురు అభినందించారు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్ రావు

పాల్వంచ: ప్రస్తుత వేసవిలో కర్మాగారాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కేటీపీఎస్ 5,6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు అన్నారు. 81వ జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కేటీపీఎస్ 5,6 దశల ఫైర్, సేఫ్టీ విభాగాల ఆధ్వర్యంలో గురువారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో సిబ్బంది రక్షణ పరికరాలు ధరించాలన్నారు. ఎస్‌ఈలు జీవీ.ధర్మారావు, టి.సత్యనారాయణ, ఎస్.సునీల్, ఇతర అధికారులు సతీష్, చంద్రశేఖర్, డి.కిరణ్, భాగం రాంప్రసాద్, వై.శ్రీనివాస్, సమ్మయ్య, నాగయ్య, శేషసాయి, మహేశ్వరరావు, నాగరాజు, రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణతోనే ఆదివాసీలకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర



మాట్లాడుతున్న చందా లింగయ్య

ఇల్లెందు: ఎస్టీ వర్గీకరణతోనే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని ఆదివాసీ సంఘాల జేఏసీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే చందాలింగయ్య దొర అన్నారు. గురువారం ఇల్లెందులోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఎస్టీ వర్గీకరణ కోసం కమిషన్ నియమించాలని కోరుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పును ఇచ్చిందని, అంబేడ్కర్ జయంతి రోజు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కమిషన్ చట్టం చేసి జీఓ విడుదల చేసినందున ఎస్టీల్లో వర్గీకరణ ఆశలు రేకెత్తాయన్నారు. ప్రభుత్వం ఆరు వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే అందులో 600 పోస్టులు ఎస్టీలకు వచ్చాయని, వాటిలో ఆదివాసీలకు 93 ఉద్యోగాలే వచ్చాయని పేర్కొన్నారు. మిగిలిన 507 పోస్టులను లంబాడీలు, ఇతర ఎస్టీలు పొందారని పేర్కొన్నారు. ఈ తరుణంలో ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ ఇతర సోదర ఆదివాసీ సంఘాల వారు పోరాటం కంటే ఇతరుల మీద దుష్ప్రచారం చేసేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయని పేర్కొన్నారు. వారు తమ వైఖరి మార్చుకుని ఎస్టీ వర్గీకరణ పోరాటంలో కలిసి రావాలని కోరారు. తొలుత ఫారెస్టు గ్రౌండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. సభలో తుడుందెబ్బ కళాకారులు గీతాలు ఆలపించారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, నాయకులు వట్టం నారాయణ, పొడుగు శ్రీనాథ్, యాసం రాజు, రేగ నరేందర్‌కుమార్, కబ్బాక శ్రావణ్‌కుమార్, మైపతి వీణారాణి, కోరం శేషయ్య, గంట సత్యం, గుంపిడి వెంకటేశ్వర్లు, బూర్క యాదగిరి, వట్టం కన్నయ్య పాల్గొన్నారు.

గోదావరిలో దూకేందుకు యత్నం

భద్రాచలంఅర్బన్: ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా భర్త ఆటోలో నుంచి దిగి బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకేందుకు యత్నించిన ఘటన గురువారం జరిగింది. భద్రాచలం నుంచి సారపాక వైపునకు వెళ్తున్న ఆటోలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆటోను భద్రాచలం బ్రిడ్జిపై ఆపి భర్త కిందకు దిగి బ్రిడ్జి మీద నుంచి గోదావరి నదిలోకి దూకే ప్రయత్నం చేశాడు. దీంతో స్థానికులు నిలువరించి సర్దిచెప్పి, అక్కడి నుంచి ఇద్దరిని పంపించారు.

వ్యక్తి అదృశ్యం



బండి అనిల్

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ తిరుపతిరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందని బండి అనిల్ అనే వ్యక్తి బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 95156 92744, 93810 24016 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబసభ్యులు కోరారు.

వేధింపుల కేసు నమోదు

దమ్మపేట: కోరిక తీర్చాలని వివాహిత మహిళను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని వడ్లగూడేనికి చెందిన జోనెబోయిన నరేష్ ఈ నెల 13న అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. ఆమెను కోరిక తీర్చాలంటూ బలవంతం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

అట్రాసిటీ కేసు..

దమ్మపేట: గిరిజనుడిని కులం పేరుతో దూషించిన మహిళపై పోలీసులు గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అప్పులు ఇస్తూ అధిక వడ్డీ వసూళ్లు చేస్తున్న తీరుపై దమ్మపేట గ్రామానికి చెందిన మహిళ జాన్‌బీని ఈ నెల 15న మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన గిరిజనుడు కాశిని వెంకటేశ్వరరావు ప్రశ్నించాడు. దీంతో సదరు మహిళ వెంకటేశ్వరరావును కులం పేరుతో, అసభ్య పదజాలంతో తీవ్రంగా దూషించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

దాడి ఘటనలో..

ఇల్లెందురూరల్: మహిళపై దాడి ఘటనలో ముగ్గురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. కొమరారం ఎస్సై నాగుల్‌మీరా కథనం ప్రకారం.. మండలంలోని బోయితండా గ్రామపంచాయతీ లక్ష్మీనారాయణతండా గ్రామానికి చెందిన మహిళ బోడ నీలపై భూ వివాదంలో సమీప బంధువులైన బోడ హచ్చ, అతని భార్య బోడి, కుమారుడు జగదీష్ మూడు రోజుల క్రితం కర్రలు, గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మంలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దుప్పి మాంసం స్వాధీనం



ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్న దుప్పి చర్మం, మాంసం

దమ్మపేట: మండలంలోని చెన్నువారిగూడెం గ్రామ శివారులోని జీడిమామిడి తోటలో ఉంచిన దుప్పి మాంసాన్ని ఫారెస్టు అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. చెన్నువారిగూడెం గ్రామానికి చెందిన కట్టం ఎర్రప్ప తోటలో దుప్పి మాంసం ఉన్నట్లు సమాచారం అందడంతో అటవీశాఖ అధికారులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. దుప్పి చర్మం, నాలుగు కేజీల మాంసంతో పాటు కొంత వండిన మాంసం స్వాధీనం చేసుకున్నట్లు దమ్మపేట ఫారెస్టు రేంజర్ కరుణాకరాచారి తెలిపారు. నిందితులు పరారయ్యారని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రూ. 4 లక్షలు డిమాండ్ చేశారా..?

దుప్పిని వధించిన సమాచారాన్ని స్థానికులు అటవీశాఖ జిల్లా అధికారికి, పట్వారిగూడెం ఫారెస్టు బీట్ ఆఫీసర్‌కు, పాల్వంచ వైల్డ్ లైఫ్ రేంజ్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో అటవీ శాఖ అధికారులు, వైల్డ్ లైఫ్, బేస్ క్యాంపు సిబ్బంది ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లి కొంత దుప్పి మాంసం, చర్మం స్వాధీనం చేసుకున్నారు. తిరిగి కార్యాలయానికి చేరుకునే క్రమంలో స్థానికులు మళ్లీ ఫోన్ చేసి ఓ కోళ్ల ఫారం వద్ద దుప్పి మాంసం వండుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో మరోమారు దాడి చేయగా మాంసం వండుతున్న వ్యక్తులు పరారయ్యారు. అటవీఅధికారులు, పోలీసులు పిలిచినా నిందితుడిగా భావిస్తున్న ఓ రాజకీయ నాయకుడు స్పందించనట్టు, విషయం బయటకు పొక్కనీయకుండా ఉంచేందుకు రూ.4 లక్షలను అటవీశాఖ అధికారులు డిమాండ్ చేసినట్టూ ప్రచారం జరుగుతోంది. కాగా ముడుపుల వ్యవహారంపై రేంజర్ కరుణాకరాచారిని వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని, విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యాయమూర్తుల బదిలీలు

ఖమ్మం లీగల్/కొత్తగూడెంటౌన్: ఉమ్మడి జిల్లాలో పలువురు న్యాయమూర్తులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయగా.. వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగూడెం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జి.భానుమతి మేడ్చల్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో హైదరాబాద్ ఒకటో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి ఎం.రాజేందర్‌ను నియమించారు. కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.రామారావు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఐదో అదనపు జడ్జిగా బదిలీ కాగా ఆ స్థానంలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఒకటో అదనపు జడ్జి కె.కిరణ్‌కుమార్‌ను నియమించారు. ఇక హైదరాబాద్ ఎనిమిదో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.కవితను కొత్తగూడెం ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా, ఒకటో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా, మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా కుషాయిగూడ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి టి.మురళీమోహన్‌ను ఖమ్మం రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా, సికింద్రాబాద్ పదో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జి ఎన్.ప్రశాంతిని మధిర సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.